# వారఫలాలు

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి

—౦❀౦—

ఆ నాడు ఆదివారం. సరిగ్గా సాయంత్రం నాలుగున్నరయింది. మందుల కొట్టు కొండల్రావుకి ఏమీ తోచక కాఫీ త్రాగుదామని స్వతంత్రా కేఫ్‌కు బయల్దేరాడు. కాఫీ త్రాగుతూ దీర్ఘంగా దేన్ని గురించో ఆలోచిస్తున్నాడు. టేబుల్ మీద ఉన్న ఆంధ్రప్రభను తీసి పేజీలు తిరగేస్తున్నాడు.

రష్యావారి కృత్రిమ ఉపగ్రహం, కాశ్మీరులో కల్లోలం, అల్జీరియాలో హత్యాకాండ, - యింకా ఎన్నో వేడి వేడి వార్తలతో పత్రిక నిండిఉంది. కొండల్రావు విసుక్కున్నాడు. తనకు పనికివచ్చే వార్తలేమీ లేవు. తనకు ఉద్యోగం యివ్వగలిగే ప్రకటన ఒక్కటీ పత్రికలో లేదు. అందుకనే స్వతంత్రంగా మందులషాపు పెట్టుకొని ఏవో నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నాడు. కొండల్రావు దృష్టి వారఫలాలవైపు కేంద్రీకరించింది. నడుస్తున్న వారానికి తన యోగం ఏలా ఉందో చూసుకున్నాడు.

"ఈ వారం శ్రమ ఎక్కువ. మనశ్శాంతి ఉండదు. లాభం, గౌరవం పెరుగుతవి. మీ శక్తులు పరీక్షించడానికా అన్నట్లు కొన్ని కొన్ని చిక్కు ఘట్టాలు ఎదురౌతవి. ఒక బ్రహ్మాండమైన గండం దాటితే గొప్ప లాభం నిస్సందేహంగా చేతికి అందేటట్టు కనబడుతుంది. ప్రయత్నం పరిపక్వమైతే మీకు సర్వదా సౌఖ్యం సిద్ధిస్తుంది. వారాంతంలో స్త్రీ సౌఖ్యం. దేహం విషయంలో తగినంత శ్రద్ధగా ఉండడం అవసరం."

కొండల్రావుకి వారఫలాలయందు నమ్మకం లేకపోలేదు. ప్రతీవారం వారఫలాల్ని చూస్తూనే ఉంటాడు. ఏవో కొన్ని కొన్ని జరుగుతూ ఉంటాయి. జరిగినప్పుడు వాటిని గురించి మెచ్చుకుంటూ ఉంటాడు. లేనప్పుడు కిక్కురుమనకుండా ఊరుకుంటాడు. ఈ వారంలో ఫలితాలు ఏలా ఉన్నా, క్రొత్తగా ఓ విషయం తనను ఆశ్చర్యపరచింది. వారాంతంలో తనకు స్త్రీ సౌఖ్యం ఉండట. అవివాహితుడైన తనకు యిదెంతవరకు నిజమౌతుందో చూడాలనుకున్నాడు. ఈ ఆలోచనతోనే యింటికి చేరుకున్నాడు.

ఆదివారం గడిచింది. సోమ, మంగళ, బుధవారాలుకూడా గడిచేయి. కాని ఏ ఒక్క సంఘటనా జరుగలేదు.

ఆ రోజు లక్ష్మివారం. సాయంత్రం అయిదింటికి కొట్టు కట్టేసి రోడ్డు వెంబడి నడుస్తున్నాడు. మెయిన్‌రోడ్ మలుపు

తిరిగి సందులోనికి సమీపించేడు. చుట్టు ప్రక్కల ఏమంతగా జనంలేరు. ప్రక్క సందులోనుంచి ఓ పడుచుపిల్ల వచ్చి రోడ్డు ప్రక్కనే నిలబడింది. తననే చూస్తున్నట్టనిపించింది కొండల్రావుకి. సడన్‌గా ఆగిపోయాడు. వారఫలాలు బుర్రలో మెదుల్తూనే ఉన్నాయి. ఆ అమ్మాయి నిజంగా తనవైపే చూస్తోందా? ఏదో గొప్ప ఛాన్సు తగిలినట్టు ఫీలయ్యాడు. వారఫలాలు ఫలించేయనుకున్నాడు. అమ్మాయికు దగ్గరగా సమీపించేడు. మాట్లాడదామనుకున్నాడు. కాని సాహసించలేకపోయాడు. అమ్మాయినిదాటి ముందుకు నడుస్తూ వెనక్కి చూశేడు. కాని తనను చూస్తూనే చరచర సందులోనికి వెళ్ళిపోయింది. బిక్కముఖం వేశాడు కొండల్రావు. వెంటనే వారఫలాల్లోని విషయాలు జ్ఞాపకంవచ్చేయి. "మీ శక్తులు పరీక్షించడానికా అన్నట్టు కొన్ని కొన్ని చిక్కుఘట్టాలు ఎదురౌతవి. ప్రయత్నం పరిపక్వమైతే మీకు సర్వదా సౌఖ్యం శిద్ధిస్తుంది."

కొండల్రావు ముఖంలో చిరునవ్వు చిందింది. వారం గడవడానికి యింకా రెండు రోజులు వ్యవధిఉంది. తన ప్రయత్నం యింకా పరిపక్వం కాలేదనుకున్నాడు. తిన్నగా యింటివైపుకు దారితీశాడు.

శుక్రవారం ఉదయం 8 గంటలు. నీటుగా ముస్తాబై షాపుకు బయల్దేరాడు కొండల్రావు. దారిలో మరో సంఘటన—

ఓ అమ్మాయి తన ముందే నడుస్తోంది. దిక్కులు చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తోంది.

తెల్లటి వాయిల్‌చీర కట్టుకుని, ఎర్రటి జార్జెట్టు రవికతొడిగి, మెల్లగ వీస్తున్న మలయమారుతానికి రేగిన ముంగురుల్ని సరిదిద్దుకుంటూ, హంసలా నడిచిపోతున్న ఆ అలివేణి అందచందాలకు ముగ్ధుడై పోయాడు కొండల్రావు. నడకలో స్పీడు హెచ్చించి ఆమెకు దగ్గరగా చేరుకున్నాడు.

"ఏమండీ? ఈశ్వర్రావుగారి యిల్లెక్కడో తెలుసా?" అకస్మాత్తుగా అడిగింది ఆ అమ్మాయి.

నవ్వుతూ అడిగినట్లనిపించింది కొండల్రావుకి. వారఫలాలమాట మర్చిపోలేదు.

"అదిగో ఆపై సందులో మొదటి యిల్లు" అంటూ అమ్మాయికి దారి చూపించేడు.

"థేంక్సు" అంటూ ఆ యువతి ముందుకు సాగిపోతున్నది.

"ఏ ఊరునుంచి వస్తున్నారు?" తెగించి మరీ అడిగేడు కొండల్రావు.

"రాజమండ్రినుంచి" నెమ్మదిగా ఆమె సమాధాన మిచ్చింది.

"ఈశ్వర్రావుగారు మీకు బంధువులా ?" సూటిగా ప్రశ్నించేడు. ఈ ప్రశ్న అడగడం అనవసరం, అప్రస్తుతం అని తనకు తెలుసు. కాని ఏదో రీతిగా సంభాషణలు పెంచాలిగా !

"మాకు కావలసినవారే" అంటూ ఆమె గబగబా నడచిపోతున్నది. రోడ్డంతా జనసంచారం హెచ్చుగా ఉంది. ఇంక కూడా పడ్డం అంత భావ్యంగా ఉండదనుకున్నాడు. వ్యధిత హృదయంతో కొంపకు చేరుకున్నాడు.

శనివారం సాయంత్రం – వారఫలితాలకు చివరిరోజు. కొంచెం టిప్‌టాప్‌గా తయారై ఈశ్వర్రావుగారి వీధమ్మట నడుస్తున్నాడు. ఈశ్వర్రావుగారి మేడ మీద ఓ అమ్మాయి నిలబడింది. ఆ అమ్మాయే తనను నిన్న పలుకరించింది ! మేడకు దగ్గరగా చేరుకున్నాడు. మేడ మీది అమ్మాయి తనవంకే చూస్తోంది. తనను తాను మర్చిపోయాడు. ఈ హడావిడిలో చేతిలోని జేబు రుమాలు క్రిందపడిపోయింది.

ఫక్కున నవ్వింది మేడమీది అమ్మాయి.

కొండర్రావు ఆనందానికి అంతులేదు. తాను నవ్వేడు. వారఫలాలు ఫలించేయనుకున్నాడు. జేబు రుమాలు దులుపుకొని జేబులో పెట్టుకున్నాడు.

అమ్మాయి నవ్వు ఆగిపోయింది.

ఇంటిప్రక్క నుంచుని దిక్కులుచూస్తూ సన్నగా ఈలవేస్తున్నాడు కొండర్రావు.

అమ్మాయి లోనికి వెళ్లిపోయింది.

ఏమైనా ప్రేమలేఖలు వ్రాయడానికి వెళ్ళిందేమోననుకున్నాడు. అమ్మాయి రాకకోసం ఆత్రుతపడుతున్నాడు.

ఇంతలో వీధితలుపు సడన్‌గా తెరువబడింది. అమ్మాయి దిగివచ్చిందేమోనని ఆశపడ్డాడు. కాని వ్యవహారం ఎదురు తిరిగింది. ఓ ముదుసలి బయటికి వచ్చేడు.

"అదేమిటయ్యా ? పైకి చూస్తూ ఈలవేస్తున్నావుట" కళ్లెర్రజేస్తూ మరీ గదిమేడు ఆ వ్యక్తి.

"ఈలవేస్తున్నావట" అని అనడంలోని అంతరార్థాన్ని అవలీలగా అవగాహన చేసుకున్నాడు మందులకొట్టు కొండర్రావు. సమాధానంకోసం తబ్బిబ్బుపడ్డాడు.

"ఏమీ లేదండీ ? దారి తెలీక దిక్కులు చూస్తున్నాను" అబద్ధం ఆడక తప్పింది కాదు.

"దిక్కులు చూడకయ్యా ! బొప్పులు తగుల్తాయి" అంటూ ఆ వ్యక్తి లోనికి వెళ్ళిపోయాడు.

అనుకున్నది తారుమారైంది కొండ్రావుకి. వారఫలాల్లో చెప్పనే చెప్పేడు దేహం విషయంలో ఈ వారం తగినంత శ్రద్ధగా ఉండడం అవసరం అని. దైవాను గ్రహంవల్ల జాగ్రత్తగానే ఉన్నాడు. లేక పోతే దేహశుద్ధి తప్పక జరిగేదే. ఇంక వారఫలాలగొడవ మర్చిపోయి దిక్కులు చూడకుండా మరీ నడుస్తున్నాడు కొండ్రావు.

—o—

ఒకాయన తనతోబాటు రైలులో ప్రయాణము చేస్తున్న మరొకాయనను "ఏమండీ! యీ రైలు క్రిష్ణానదిబ్రిడ్జిమీదుగా వెళ్ళుతుంది కదండీ" అని అడిగాడు.

"అదేమిటండీ అలా అడుగుతారు! పోయి తీరాలి; లేకపోతే అందులో పడిపోదూ!" అన్నాడు మరొకాయన.

♦ ♦ ♦

"ఏమండీ! నేను కుతుబ్మినార్ దగ్గరకు వెళ్ళాలి ఎక్కడ దిగాలో చెప్తారూ!" అని అడిగాడు ఒక బస్సు ప్రయాణీకుడు మరొకరిని.

"అలాగే - నేను అటే పోవలసియున్నది. నేను ఎక్కడ దిగుతానో చూడండి; దానికి ముందు స్టాప్‌లో దిగాలి మీరు కుతుబ్మినార్ దగ్గర కెళ్ళడానికి" అన్నాడు

యస్. యమ్. వాగ్దేవు

వంట యింట్లో పిల్లలు లడ్డుండలు తింటుంటారు. తల్లి వంటింట్లోకి వస్తూ "బాబూ! నాన్నగారికి అట్టే పెట్టినవానినికూడ తింటున్నారేమిటిరా!" అని కేక వేసింది.

ఒక పిల్లవాడు "మమ్మలను మాట్లాడించకమ్మా! నీవేగా తినేటప్పుడు మాట్లాడకూడదని చెపుతుంటావు - పూర్తికానియ్యి" అన్నాడు.

♦ ♦ ♦

ఒక ఎలిమెంటరీస్కూలు మాష్టరు తరగతిలో పాఠము చెప్పుతూ "కరెక్టుటైము ఎలా కనుక్కోగలరో చెప్పగలరా" అని అడిగాడు

ఒక బాలుడులేచి "మా యింట్లో ఒక గడియారమున్నది సార్! అది ఎప్పుడు చూచినా ఒకే టైమును చూపుతుంటుంది. అదే కరెక్టుటైము" అన్నాడు ధీమాగా.

♦ ♦ ♦

భోజనం దగ్గర తండ్రి పిల్లలతో "ఎప్పుడూ కొంచెము వెల్తిగా భోంజనం చేయడం మంచిది" అన్నాడు.

ఆరేండ్ల కూతురు "అవును నాన్నా! మీరు చెప్పినట్లు గొంతుక కొంచెము వెల్తిగానే తింటాము" అన్నది.

యస్. చిరంజీవి

బిచ్చగాడు:—"బీదవాడిని బాబూ! కాని డబ్బివ్వండి"
ఒక పెద్దమనిషి:—"చిల్లరలేదు పోవోయ్."
బిచ్చగాడు:—"నా దగ్గర ఉన్నదండీ!"
పెద్దమనిషి:—డబ్బులు లేవు.
బిచ్చగాడు:—ఆ మాట మొదటే చెప్పకూడదా బాబూ!"

♦ ♦ ♦

ఇద్దరు చెవిటివాళ్లు స్టేషను ప్లాట్‌ఫారంమీద కలసికున్నారు. ఒకాయన మరొకాయనను "ఎక్కడికి దాక కృష్ణయ్యగారూ!" అని అడిగాడు.

"ఎక్కడినుండి వస్తున్నానని అడుగుతున్నారా! ఇంటినుంచే—రాజమండ్రి వెళదామని వచ్చాను."

"ఇంటికెళ్తూ యిూరకనే వచ్చారా! నేను రాజమండ్రికి వెళ్ళుతున్నానులెండి! వెళ్ళివస్తాను."

చివరకు యిద్దరూ రైలు ఎక్కారు,

బొడ్డుపల్లి కృష్ణావధాని